క్లుప్తంగా

అక్రిడిటేషన్ కార్డుల జారీ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు రెండో విడత అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయనున్నట్లు కలెక్టర్ భవేష్‌మిశ్రా తెలిపారు. కలెక్టర్ భవేష్‌మిశ్రా, డీపీఆర్‌ఓ శ్రీధర్ అధ్యక్షతన శనివారం జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 96 మంది జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోగా దరఖాస్తులను జిల్లా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్, సభ్యులచే స్థానికత, విద్యార్హత, గత అనుభవాల ఆధారంగా స్క్రూటిని చేసినట్లు తెలిపారు. వారిలో 14 మంది జర్నలిస్టులను అర్హులుగా గుర్తించి కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు.

మైక్‌సెట్ అందజేత

గణపురం: మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు కట్టపై ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయానికి రూ.25 వేల విలువ చేసే మైక్‌సెట్‌ను ఎస్సై అభినవ్-రవళి దంపతులు శనివారం అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకుడు వేణుగోపాల చార్యులుకు మైక్‌సెట్‌ను అందించారు.

అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి రూరల్: కురుస్తున్న వర్షాలతో పట్టణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వైర్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని కోరారు. చెరువులు, వాగుల వద్దకు పిల్లలను వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో పలు చోట్ల రోడ్లు, వంతెన నిర్మాణాలు సరిగ్గా లేవని కాలువలు, వాగులను దాటొద్దన్నారు. ముఖ్యంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది వర్షాకాలంలో విద్యుత్ ప్రమదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అరెస్ట్

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి చెప్పుల దండ వేసిన మతిస్థిమితం లేని వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి శనివారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి రాజీవ్‌గాంధీ విగ్రహానికి చెప్పుల దండ వేసినట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ ఫిర్యాదు చేయగా విచారణ చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా సంఘటన స్థలంలో పరిశీలించగా మతిస్థిమితం లేని వ్యక్తి వేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీంతో అతడిని పట్టుకోని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

విద్యార్థులు తరలిరావాలి



మహదేవపూర్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న సికింద్రాబాద్ పెరడ్ గ్రౌండ్‌లో లక్ష మందితో నిర్వహించే బహిరంగా సభకు విద్యార్థులు తరలిరావాలని ఏబీవీపీ నగర కార్యదర్శి గోగుల కృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రలో ఆయన శనివారం మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం అవుతున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఉన్న విద్యారంగా సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సుశాంత్, శేఖర్, సాయిరాం, రాహుల్, దుర్గేష్, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లికి చేరుకున్న సంకల్ప యాత్ర

భూపాలపల్లి అర్బన్: సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న పాత పెన్షన్ సాధన సంకల్పయాత్ర శనివారం సాయంత్రం భూపాలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని జయశంకర్, అంబేడ్కర్ చిత్రపటాలను పూలమాల వేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. 2004 సంవత్సరంలో అమలులోకి వచ్చిన సీపీఎస్‌ను రద్దు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు దిల్షాద్, శివకృష్ణ, సుభాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మయ్య, రఘు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరం

వాజేడు: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి జ్ఞానస అన్నారు. మండల పరిధిలోని మొరుమూరు కాలనీ, బొల్లారంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. అదే విధంగా పలువురి నుంచి రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఈగలు, దోమల వలన రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులను, బాలింతలను, క్షయవ్యాధి గ్రస్తులను, బీ పీ పేషెంట్‌లను పరీక్షించి మందులను అందించారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



చిట్యాల: సంఘీభావం తెలుపుతున్న నాయకులు



భూపాలపల్లి రూరల్‌లో..



మహాముత్తారం: సమ్మెలో పాల్గొన్న సిబ్బంది

కాటారం: గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవిపటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు తీన్మార్ మల్లన్న టీం సభ్యులు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రవిపటేల్ మాట్లాడుతూ.. కార్మికులను పర్మనెంట్ చేయడంతో పాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు అందజేయాలని అన్నారు. ఇనుగాల ప్రణయ్, నర్సయ్య, చంద్రన్న, కార్మికుల జేఏసీ నాయకులు శ్రీనివాస్, మల్లేశ్, కొండయ్య పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లిలో పంచాయతీ సిబ్బంది చేపట్టిన సమ్మె శనివారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రచారకులు కొత్తూరు రవీందర్ మహారాజ్ మాట్లాడుతూ.. సిబ్బందికి కనీస వేతనం రూ.19వేలు చెల్లించాలన్నారు. ప్రచారకులు రవీందర్, నాయకులు మహర్షి, తిరుపతి, దశరథం, నరేష్, శ్రీధర్, నందు నాయక్ సుదర్శన్, కాజా, పూర్ణ, తిరుపతి పాల్గొన్నారు.

మహాముత్తారం: తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారానికి 17వ రోజుకు చేరింది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె విరమింపజేసేది లేదని సిబ్బంది స్పష్టం చేశారు.

వినతిపత్రం అందజేత

మల్హర్: తమ సమస్యలను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేస్తూ మండల కేంద్రం తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని మహాత్మగాంధీజీ విగ్రహానికి పంచాయతీ కార్మికులు శనివారం వినతిపత్రం అందజేశారు. జీఓ 51ను రద్దు చేసి, 60 జీఓను అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కారోబార్ల సంఘం మండల అధ్యక్షుడు కనుకుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నారా శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగపు శ్రీకాంత్, కుమారస్వామి, రవీందర్, తిరుపతి, రామస్వామి, కమాలుద్దీన్, రామిడి శ్రీనివాస్, మహమ్మద్ అజ్మీర్ పాల్గొన్నారు.



మల్హర్: గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

చిట్యాల: పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా కనీసం ఎవరూ పట్టించుకోవడం లేదని తమపై అధికారులు కనికరించాలని కోరుతూ జీపీ సిబ్బంది సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు మ్యాదరి రాజేందర్, జిల్లెల కుమార్‌లతోపాటు సిబ్బంది తహసీల్దార్ సుమన్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. సిబ్బంది సమ్మెకు డీఎస్‌పీ(ధర్మ సమాజ్ పార్టీ) నాయకులు సంఘీభావం తెలిపారు.

మొగుళ్లపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె శనివారం17వ రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. క్యాతరాజు రాజయ్య, అబ్బు, మ్యాదరి రమేష్, జగన్నాథం, శ్రీరాం కృష్ణయ్య, సురేష్ పాల్గొన్నారు.



కాటారం: సంఘీభావం తెలుపుతున్న రవిపటేల్



మొగుళ్లపల్లి: చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



మొగుళ్లపల్లి: సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘర్షణ సైకిల్ యాత్రకు ముఖ్య అతిథిగా కిరణ్ హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలన్నారు. పెరిగిన మెస్ చార్జీలు వెంటనే అమలు చేయాలన్నారు. పెరిగిన ధరల కనుగుణంగా మెస్ చార్జీలు పెంచుతామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం పెంచినట్లే ప్రకటనలు చేసి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని ఇప్పటివరకు కూడా చేయలేదన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని సామాజిక తరగతులు వారిగా ఆరు గురుకుల పాఠశాలలు ప్రారంభించిన ప్రభుత్వం పీజీ వరకూ అమలు చేయకుండా చేతులెత్తేసిందన్నారు. నూతన గురుకులాలకు పక్కా భవానాలు నిర్మించకపోవడంతో అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో విద్యార్థులు విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం గద్దె దించే వరకు విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చెన్నూరి రాజు, విజయ్, రిత్విక్ పాల్గొన్నారు.

పెండింగ్ చార్జీలను విడుదల చేయాలి

చిట్యాల: పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మొగుళ్లపల్లి నుంచి ప్రారంభమైన సంఘర్షణ సైకిల్ యాత్ర చిట్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న చార్జీలను ప్రభుత్వం మంజూరు చేయాలని కోరుతూ ఈ యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

బాలుడి ఆచూకీ లభ్యం

భూపాలపల్లి రూరల్: జూన్ నెలలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బాలలసంరక్షణ అధికారుల కళ్లుకప్పి పారిపోయిన బాలుడి ఆచూకీ లభించినట్లు జిల్లా సంక్షేమాధికారి టి.శైలజ శనివారం తెలిపారు. సంక్షేమాధికారి తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ నెలలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు ఒక బాలుడు సైకిల్‌పై వెళ్తుండగా రేగొండ సమీపంలో పోలీసులు గుర్తించి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులకు అప్పగించారన్నారు. బాలుడిని సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచగా విచారించిన కమిటీ బాలుడిని ఛత్తీస్‌గఢ్ డీసీపీయూ, సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించే క్రమంలో మార్గమధ్యలో అధికారుల కళ్లు కప్పి తప్పించుకున్నాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి బీజాపూర్, దంతేవాడ సీడబ్ల్యూసీ, డీసీపీయూ అధికారులతో బాలుడి ఆచూకీ కోసం ప్రయత్నించినట్లు తెలిపారు. ఈ క్రమంలో వెతుకుతుండగా దంతేవాడ జిల్లాలోని అతడి స్వగ్రామంలో తల్లితో ఉన్నట్లు గుర్తించారన్నారు. బాలుడికి, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేసి బాలుడికి (ఛత్తీస్‌గఢ్) తరఫున అందాల్సిన పథకాలను అందిస్తామని అక్కడి డీసీపీఓ తెలిపారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

టేకుమట్ల (రేగొండ): గోరికొత్తపల్లి మండలంలోని విజ్జయ్యపల్లి గ్రామానికి చెందిన బైకాని సమ్మయ్య, నిజాంపల్లికి చెందిన కందాల సుజాత, చెన్నోజు రాజమొగిలి, బమ్మ మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు శనివారం పరామర్శించారు. అలాగే రేగొండ మండలంలోని కనిపర్తి గ్రామంలో శ్రీపతి మొగిలిగౌడ్ మృతి చెందగా అతని మృతదేహానికి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన పడకంటి రమ్య, లింగాలకు చెందిన ముత్యాల స్వరూప మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన కొడగాని ప్రవీన్ మృతి చెందగా మృతదేహానికి చిట్యాల ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో గండ్ర సత్యనారాయణరావు శనివారం నివాళులర్పించారు. అలాగే అదే గ్రామానికి చెందిన మూత రాజీరమ్మ, వెల్లంపల్లికి చెందిన తోడేటి సరోజన, కుందనపల్లికి చెందిన బండ మహేష్, ఆశిరెడ్డిపల్లికి చెందిన బందారి బొందాలు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.



పరామర్శిస్తున్న గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: మండలంలోని జూకల్‌కు చెందిన కంచు రాయమల్లు, కానుగుల రాజమొగిలి, మండల కేంద్రానికి చెందిన సరిగొమ్ములు భద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను సత్యనారాయణరావు పరామర్శించారు.

నిందితులను ఉరి తీయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

చిట్యాల: మణిపూర్‌లో మహిళలను నగ్న ప్రదర్శన చేసిన నిందితులను ఉరి తీయాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్ల మల్లయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మణిపూర్‌లో జరిగిన ఘటనకు నిరసనగా శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏవైఎస్ నాయకులు గుర్రపు రాజేందర్, జన్నే యుగేందర్, పుల్ల ప్రతాప్, గురుకుంట్ల కిరణ్, కట్కూరి రాజేందర్, గుర్రం తిరుపతి, గడ్డం కొమురయ్య, గుర్రపు రాజమౌళి, కనకం తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

'మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం'

టేకుమట్ల(రేగొండ): దేశంలోని మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఆల్‌ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పసుల వినయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మణిపూర్‌లో 80 రోజులుగా హింసకాండ జరుగుతున్న కనీసం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. మహిళలను అర్ధనగ్నంగా ఊరేగింపు చేయడం అన్యాయమని అన్నారు. ఈ సంఘటనపై దేశ ప్రధాని ఇప్పటి వరకు నోరు విప్పకపోవడం సిగ్గుచేటని అన్నారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన కుదుపాక రాజు భార్య సుజాత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో రాజుతో కలిసి పదవ తరగతి చదువుకున్న స్నేహితులు బాధిత కుటుంబానికి శనివారం రూ.8,000 నగదు, బియ్యం అందజేశారు.

కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటాం

ములుగు : పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుతకుంటామని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బొంతల వేణుతో పాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా సీతక్క కండువా కప్పి ఆహ్వానించారు. రాబోయే రోజులు కాంగ్రెస్ పార్టీవేనని, ప్రజలంతా కాంగ్రెస్‌తోనే ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో జరిగే కుటుంబ పాలనను గద్దెదించే రోజులు వస్తున్నాయని అన్నారు. జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్ ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీతక్క

సంరక్షణ చర్యలు చేపట్టాలి

కాటారం: వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత రైతులు సాగు చేసిన పంటల్లో సంరక్షణ కోసం తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి గిరి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్తి పంటలో నీరు, తేమ తగ్గిన తర్వాత గొర్రుతో అంతరకృషి చేయాలని దీని ద్వారా పత్తి వేర్ల దగ్గర నీరు నిల్వ లేకుండా చేయవచ్చన్నారు. ఎకరాకు 25 కిలోల యూరియా వేయాలని, ఒకవేళ ఎరువులు వేయలేని పరిస్థితి ఉంటే షాలీఫీడ్ 19-19-19 లేదా 13-0-45 లేదా యూరియా 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వేరుకుళ్లు, కాండం కుళ్లు రోగాలు వచ్చే అవకాశం ఉన్నందున వర్షం తగ్గిన వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని మొక్క మొదళ్లు తడిచేలా వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని తెలిపారు. వరి నారుమళ్లలో వర్షం తగ్గిన తర్వాత మురుగునీరును తొలగించాలని, ఎకరా నారుమడికి రెండు కిలోల చొప్పున యూరియా, డీఏపీ, పొటాష్ వేయాలని పేర్కొన్నారు. రైతులు సాగులో ఎదుర్కొనే సమస్యలపై వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఏఓ కోరారు.

పంటల పరిశీలన

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలోని పత్తి పంట, మిరప నారులను మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలతో పత్తి పంటలో నీరు నిల్వ ఉండి, ఎర్రబడటం గమనించినట్లు తెలిపారు. చేనులోని నీటి నిల్వను తీసేసి 19:19:19 లేదా నానో యూరియా, నానో డీఏపీని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పత్తి మొక్కలు చనిపోయినట్లయితే మొక్క మొదళ్ల భాగంలో కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును 2 గ్రామాలు లీటర్ నీటిలో కలిపి మొదళ్ల భాగంలో పోయాలని తెలిపారు. అలాగే మిరప నారుమడుల్లో వర్షలకు నారు కుల్లు గమనించినట్లు తెలిపారు. నివారణకు మేటలక్సిల్ అనే మందును 2 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంటన ఏఈఓ మనీషా, రైతులు ఉన్నారు.



మల్హర్: పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ మహేష్

రాజకీయ లబ్ధికోసమే ఆరోపణలు

చిట్యాల: రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ నాయకులు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. శనివారం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై కాంగ్రెస్ నాయకుడు, సీఆర్‌పల్లి సర్పంచ్ ముకిరాల మధువంశీకృష్ణ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాని అన్నారు. తాను ఎక్కడ ఏలాంటి భూదందాలు, ఇసుక మాఫీయా చేయలేదని అన్నారు. అతడు చేసిన దందాలను కప్పిపుచ్చుకునేందుకే తనపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించ లేని సర్పంచ్ జిల్లాలోని సమస్యలను పరిష్కరించగలవా అని ఎద్దేవా చేశారు. నీ బాధితులే ఇక్కడికి వచ్చి వారి గోడును వెల్లబోసుకున్నారని అన్నారు. తాను భూదందాలు, కమీషన్లు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, మండల కో-ఆర్డినేటర్ రవీందర్‌రావు, డైరెక్టర్ పిట్ట సురేష్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు తిరుపతి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు తిరుపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, సర్పంచ్‌లు పూర్ణచందర్ రావు, మహేందర్, నాయకులు వీరారెడ్డి, అశోక్‌రెడ్డి, పాపిరెడ్డి, వెంకన్న, రవీందర్, టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, అనందరెడ్డి, నవీన్, సుధాకర్, మల్లక్క, సుమలత, రవీందర్‌గౌడ్, రాజు, రాజేందర్, యుగేందర్, రాజమొగిలి, మల్లయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్

దాశరథికి ఘన నివాళి



దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో జిల్లా భారత జాగృతి ఆధ్వర్యంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు మాగ హరీష్‌రెడ్డి హాజరై నివాళులర్పించి మాట్లాడారు. నిజాం వ్యతిరేక పోరులో పాల్గొన్నందుకు నిజామాబాద్ జైలుకు తరలిస్తే జైలు గోడలపై కూడా 'నా తెలంగాణ కోటి రతనాల వీణా' అని బొగ్గుతో రాసిన కవి యోధుడు ప్రజాకవి దాశరథి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జగృతి నాయకులు చీకటి గణేష్, అభిలాష్ రెడ్డి, కుమారస్వామి, సందీప్ గౌడ్, వంశీ, వినయ్ కుమార్, శ్రీనాథ్, సాయి కుమార్, పవన్, భారత్ రెడ్డి, నరేష్, హరీష్, విన్ను, సనత్ కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

మహదేవపూర్: హైదారాబాద్‌లో ఈ నెల 29న నిర్వహించే విశ్వరూప మహాసభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సురేష్ పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేయాలని కోరుతూ.. శనివారం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్మయ్య, మంథని రవితేజ, శ్రీనివాస్, పత్తి మల్లేష్, అశోక్, రసపల్లి లక్ష్మన్, సంజీవ్, కోరల్ల ప్రతాప్, కొయ్యల రాము, శ్రీను, మల్లేష్, కొలుగురి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్

సామాజిక ఆస్పత్రిలో రక్తదానం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో గల బ్లడ్‌బ్యాంక్‌లో మండల కేంద్రానికి చెందిన నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు శనివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దడిగల నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచందర్, జిల్లా గౌరవ అధ్యక్షు ఛిజీ దడిగల సమ్మయ్య మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. అలాగే ఆపదలో ఉన్న ఎందరికో రక్తదానం చేస్తున్న ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ సేవలను కొనియాడారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు దడిగల లక్ష్మణ్, సత్యం, మహేందర్, రాజారామ్, శ్రీరాములు ఉన్నారు.



సర్టిఫికెట్లు అందుకుంటున్న దాతలు